## కంప్యూటర్ యుగంలో కూడా కాలి నడకే శరణ్యం



2 లో


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 16 మే, 2024 | పేజీలు : 05


## ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకోవడం జరిగిందని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్ పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు, అలాగే మండలంలోని తొగర్రాయి (జండాపల్లి) గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ బీరన్న పట్నలా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజ్జన్న పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గౌడ సంఘం సభ్యులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# భద్రత సిబ్బంది అలర్ట్‌గా ఉండాలి

### స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను పరిశీలించిన కలెక్టర్, సిపి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ ఎస్సారార్ కాలేజీలో భద్రపరిచిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంల స్ట్రాంగ్ రూముల వద్ద పోలీసు భద్రతను బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పరిశీలించారు. వేర్వేరుగా భద్రపరిచిన అన్ని స్ట్రాంగ్ రూములను పర్యవేక్షించి భద్రతపై సమీక్షించారు. సిసి కెమెరాల పనితీరు, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహణ, ఇంకా ఏమైనా అధనంగా చేపట్టాల్సిన భద్రత అంశాలపై జిల్లా కలెక్టర్, సిపి చర్చించారు. ఈ మేరకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా కాలేజీ చుట్టూరా పర్యవేక్షించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్, ఇతర వ్యక్తులు కాలేజీలోకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు వారు సూచించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు భద్రత సిబ్బంది, అధికారులు అలర్ట్‌గా ఉండాలని కలెక్టర్ సిపి పేర్కొన్నారు. రాత్రి వేళల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, టౌన్ ఏసిపి నరేందర్ తదితరులున్నారు.



# అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

### జూన్ 15వ తేదీ లోగా గుడి చెరువు పనులు పూర్తి చేయాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి స్వామి గుడి చెరువు అభివృద్ధి పనులు అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గుడి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ చెరువు ఆవరణలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో బండ్ పార్క్ లో కొనసాగుతున్న నిర్మాణాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్, ఇతర నిర్మాణ పనులను మ్యాప్ లు పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి పనులు సంప్రదాయ బద్ధంగా, ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఉండాలని సూచించారు. పిల్లల ఆట స్థలాలు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేయాలని, రంగులు వేయించాలని ఆదేశించారు. వాకింగ్ ఏరియా, ఓపెన్ జిమ్ తదితర పనులన్నీ జూన్ 15వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మికుల సంఖ్యను పెంచి, పనులు త్వరితగతిన చేపట్టాలని పేర్కొన్నారు. నటరాజ విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు. సూర్య నమస్కార్ వద్ద మొక్కలు, గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్క్ ను కలెక్టర్ పరిశీలించి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ కు పలు సూచనలు చేశారు. ఇక్కడ టూరిజం సీఈ వెంకటరమణ, డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్ రెడ్డి, డీటీసీపీఓ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం ఇంకెప్పుడు కొంటరు..?

### అకాల వర్షాలతో అన్నదాత ఆగమాగం..!

**ప్రజాపక్షం /ముత్తారం :** ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో వారాల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. అధికారులు ఎప్పుడు వస్తారో.. తేమ శాతం చూసి ఎప్పుడు కాంటాలు పెడతారో అని పడిగాపులు కాస్తున్నారు. కాగా మళ్లీ వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ సహకార సంఘం, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యంకొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం ఎండిపోయి పరం పరం అవుతోంది. అధికారులు చెప్పిన విధంగా 17శాతం లోపు తేమ ఉంటే ధాన్యం కొనుగోలు చేయాలి. కానీ ధాన్యంలో తేమ కొలిచేందుకు కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది కరువయ్యారు. ఎండిన (మ్యాచర్) వరి ధాన్యాన్ని అధికారులు ఏర్పాటుచేసిన సిబ్బంది వచ్చి తేమశాతం కొలవాలి. అయితే వారికి నచ్చిన చోటుకు నచ్చినప్పుడు వస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ధాన్యం ఎండినా.. సరైన సమయంలో అధికారులు రాకపోవడం, కాంటాలు పెట్టకపోవడంతో రైతులు కేంద్రాల వద్దే ఉండాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల నుండి అప్పుడప్పుడు అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. అయితే ఆరిన నేపథ్యంలో రైతన్నలు మధ్యలో వర్షం వచ్చిందంటే అంతే సంగతులు. మళ్లీ నాలుగైదు రోజులు ఆరబెట్టాలి. కాగా ఉదయం అంతా ధాన్యం ఆరబోస్తూ.. సాయంత్రం కాగానే వర్షం భయంతో దగ్గరకు పోసి టార్పాలిన్లు కప్పాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రేపు ఇచ్చోడ మండల సర్వ సభ్య సమావేశం

ప్రజా పక్షం/ ఇచ్చోడ : ఇచ్చోడ మండల సర్వ సభ్య సమావేశంను ఈ నెల 17 న స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీ డీవో కొండ లక్ష్మ ణ్ తెలిపారు. బుదవారం ఆయన ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడారు. సమావేశం ఉదయం పదకొండు గంట లకు ప్రారంభమవుతుందని చెప్పారు. ఎంపీటీసీలు, ఆయా శాఖలకు చెందిక అధికారులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు.

## టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** గత నెలలో ప్రకటిం చిన పదవ తరగతి ఫలితాల్లో ఇల్లందకుంట మండ లంలోని మోడల్ స్కూల్ వరుసగా రెండోసారి వంద శాతం ఫలితాలను నమోదు చేసినందుకు గాను బుధవారం కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడి టోరియంలో కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీ దుగా ప్రిన్సిపాల్ మునిగడప సత్యనారాయణచా రికి శాలువా కప్పి, మెమొంటో ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించిన విధ్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లకు దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంశోద్దీన్, శ్రీధర్, సంధ్య, భాగ్య, అమీన్, రవి, తిరుపతిరెడ్డి, అజీమ్ , తిరుపతి తదితరులున్నారు.

## గ్రామాల్లో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



**ప్రజాపక్షం/శంకరపట్నం :** మండల పరిధిలోని ఆర కండ్ల , కాచాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో పట్టపగలు సైతం విద్యుత్ లైట్లు వెలు గుతున్నాయి. విద్యుత్ అధి కారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృధా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. వీధి దీపాల నిర్వహణలో సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమ ర్శిస్తున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వంద లాది యూనిట్లు విద్యుత్ వృధా అవ్వడంతో పాటు బల్బులు కూడా తొందరగా పాడయిపోయే వీలుం దన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

## ఇద్దరికి చూపునిచ్చిన పి.డి సదానందం

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** ఎన్నికల విధులు నిర్వహించిన మరుసటి రోజే గుండెపోటుతో మృతి చెందిన రామకృష్ణాపూర్ లోని ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గడిగొప్పుల సదానందం నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు వెలు గులు పంచారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు సమాజ హితం కోసం నేత్రదా నానికి ముందుకు వచ్చారు. దీంతో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్లు సదానందం నేత్రాలను సేకరించి హైదరాబాద్ కు తరలించారు.

## 400 ఏండ్ల పురాతన చరిత్ర కలిగిన దర్గా షరీఫ్



### 18, 19న దర్గాలో ఉర్సు ఉత్సవాలు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** సిర్పూరు(టి) మండలం లోని దర్గా షరీఫ్‌కు నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ దర్గా గురించి స్థానికులు కథలు కథలుగా చెప్పుకుం టారు. మహారాష్ట్రలోని నాగపూర్ నుండి కాలినడకన బాబా ఇక్కడికి చేరుకున్నట్లు చెబుతుంటారు. బాబా ఫకీ రులా మండలంలో సంచరిస్తుండేవాడనీ, చిన్న పిల్లలను వెంటబెట్టుకొని మండలంలో తిరుగుతూ ఇంటింటికీ భిక్షం స్వీకరించి ఊరి బయట ఏర్పాటు చేసుకున్న నివా సంలో ఒక కుండలో భద్రపరుచుకునేవాడని అంటుం టారు. చిన్నపిల్లలు తినడానికి ఏదైనా కావాలని అడిగితే ఆ కుండలో నుండి తీసి ఇచ్చేవాడని ప్రచారం ఉంది. ప్రతీ రోజు సాయంత్రం ఆయన నివాసంలో దీపాన్ని వెలిగించేవాడని, నూనె తీసే వారి ఇళ్ల నుండి నూనెను సేకరించి ఈదీపాన్ని వెలిగించేవాడని, ఒకరోజు ఎవ్వరు కూడా నూనె ఇవ్వకపోవడంతో గానుగల నుండి నూనె రావడం ఆగిపోయిందని చెపుతుంటారు. దీనితో వీరంతా బాబా వద్దకు వెళ్లి క్షమాపణ కోరగా మళ్లీ యధావిధిగా నూనె రావడం ప్రారంభమైందని పూర్వీకులు తెలుపుతున్నారు. బాబా కొన్నేళ్లకు ఇక్కడే చనిపోయి సమాధి అయ్యాడని అంటుంటారు. అనం తరం నిజాం కాలంలో మహారాష్ట్రలోని ఐరి పట్టణం గోండు రాజును శత్రువులు వెంటాడటంతో వారి బారి నుండి తప్పించుకోవడానికి రాజు ఈప్రాంతానికి చేరు కున్నాడని, రాత్రి ఇక్కడే పడుకోగా బాబా కలలోకి వచ్చి నీకేం భయం లేదని, నేను ఇక్కడే సమాధిలో ఉన్నానని అభయం ఇచ్చి ప్రతీ ఏటా (హజరత్ ఖిబ్లా సయ్యద్ తాలీబ్ అలీషా బాబా పేరిట ప్రతీ సంవత్సరం ఉర్సు ఉత్సవాలు నిర్వహించాలని చెప్పినట్లు ప్రచారం. ఆరోజు నుండి ఈ నాటి వరకు ప్రతీ ఏటా ఇక్కడ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి శుక్రవారం ఉదయం సిర్పూరు(టి)లోని దర్గాషరీఫ్ సాయంత్రం వరకు దర్గా తలుపులు తెరుస్తారు. పూజలు చేసుకున్న భక్తులను బాబా అనుగ్రహిస్తాడని స్థానికుల విశ్వాసం. ప్రతి ఏటా రెండు రోజుల పాటు జరిగే ఉద్య ఉత్సవా లలో అన్ని మతాల వారు పాల్గొంటారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, చెన్నూరు, కోట పల్లి, ఉట్నూరు, ఆదిలాబాద్, కాగజ్ నగర్ పట్టణాల నుండే కాక ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆసిఫాబాద్ ఆర్టీసి డిపో వారు ఈ రెండు రోజులు ప్రత్యేక బస్సులను నడుపుతారు. ఈనెల 18, 19 తేదీలలో హజరత్ ఖిబ్లా సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దర్గా షరీఫ్ ఉర్సు ఉత్స వాలు శనివారం ప్రారంభమౌతాయి. జిల్లాలోని మంచి ర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, చెన్నూరు, కోటపల్లి, ఉట్నూరు, ఆదిలాబాద్, కాగజ్ నగర్ పట్టణాల నుండే కాక ఇతర జిల్లాలు, మహారాష్ట్ర ఐరి, ఆలపల్లి, నాందేడ్, నుంచి మతాలకు అతీతంగా వేలాది సంఖ్యలో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి తమ మొక్కు లను తీర్చుకుంటారు. భక్తులకు అసౌకర్యాలు కలగ కుండా షామీనాలు ఏర్పాటు చేయడం, తాగునీటి సౌకర్యం కూడ కల్పించారు. అదేవిధంగా ఉత్సవాల కమిటీ సభ్యులు ఆసిఫాబాద్ డిపో మేనేజర్‌కు ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా భక్తుల కొరకు రెండు రోజులపాటు స్పెషల్ బస్సులను నడపాలని కోరారు.

## ఎలక్షన్ డ్యూటీ చేసిన ఆశావర్కర్లకు టిఏ, డిఏ ఇవ్వండి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** 2024 అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించిన ఆశా వర్క ర్స్‌కు టిఏ, డిఏలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియూ ఆద్వర్యంలో బుధ వారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్‌వో పవన్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లా డుతూ ఆశ వర్కర్లను సొంత గ్రామంలో తమ పోలింగ్ బూత్ పరిధిలో డ్యూటీ వేయాలన్నారు. తమతో ఎలక్షన్ డ్యూటీ చేసిన ఆశవర్కర్స్ మినహా ప్రతి ఒక్కరికీ పోలింగ్ రోజు టిఏ, డీఏలు ఇచ్చారని, తమ గ్రామంలో కాకుండా అవసరాల నిమిత్తం పక్క పట్టణాలకు, గ్రామాల్లో ఎన్నికల డ్యూటీలు వేసి చేతులు దులుపుకో వడం సమంజసం కాదన్నారు. ఎన్నికల కోసం తమ చేతిలో నుంచి ఆటో కిరాయిలు, టిఫిన్, భోజనం ఖర్చులు పెట్టుకున్నారని, ఒక్కొక్కరికీ రూ.500 రూపా యలు ఖర్చు అవుతోందన్నారు. ఈ విషయం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తే ఆశా వర్కర్లకు టిఏ, డీఏలు ఇచ్చామని, జిల్లాల్లో ఎలక్షన్ కమిషన్ అధికారికి విన్నవించాలని చెప్పారు. అందులో భాగంగానే వినతి పత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. పక్క జిల్లాలు జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఇచ్చారని, కరీంనగర్ జిల్లాలో ఇవ్వలేదన్నారు. ఇది జిల్లా అధికా రుల పనిలో లోపమని స్పష్టమవుతోందన్నారు. ఇవ్వ నిచో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో డ్యూటీలు బంద్ చేస్తామని తెలియజేశారు. కాబట్టి వెంటనే టిఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. కార్యక్ర మంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సరిత, వెంకట లక్ష్మి , అంజలి, ప్రియాంక, జీవ లక్ష్మి , భాగ్య, లక్ష్మి , శోభ తదితరులున్నారు.

## కంప్యూటర్ యుగంలో కూడా కాలి నడకే శరణ్యం



భీంరెల్ల గ్రామస్థుల అవస్థలు

**ప్రజాపక్షం/తిర్యాని :** మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతూ కోట్లాది రూపాయలు వెచ్చి స్తున్నప్పటికిని అవి క్షేత్రస్థాయిలో అమలు కాకపోవ డంతో కొన్ని గ్రామాలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయని సర్వత్రా ఆరోపణలు వినిపి స్తున్నాయి. తిర్యాని మండలంలోని ఉమ్మడి మంగి గ్రామపంచాయతీ పరిధిలోని భీంరెల్ల గ్రామంలో ప్రజ లకు కనీస సౌకర్యాలు లేకపోవడం తో ఆగ్రామస్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. తోయరేటి గ్రామం నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో 15 ఆదివాసీ కుటుంబాలు ఉండగా సుమారు 50 మంది వరకు జనాభా ఉన్నారు. నేటికీ ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏ కాలంలో అయిన గ్రామస్తులకు కాలినడక తప్పడం లేదు. ప్రతీ అవసరానికి తోయరేటి గ్రామా నికి కాలినడకన వెళ్లి అక్కడి నుంచి వాహ నాల ద్వారా మంగి లేదా తిర్యాని కి వెళ్లాల్సి ఉంటుంది. అయితే కాలినడకన వెళ్లే దారి కూడా ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దారి మొత్తం పెద్ద బండరా ళ్లతో నిండి ఉండగా రేషన్ బియ్యం, పింఛన్, నిత్యావ సర సరుకుల కోసం అనేక అవస్థలు పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో అత్యవసర పరిస్థితుల్లో తాము పడే అవస్థలు అన్ని ఇన్ని కావని కనీసం అంబులెన్స్ రాలేని దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంభం దిత అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## మాయమైపోతున్న పశువులు



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** గత కొన్ని రోజులుగా సిర్పూర్ టి మండలం లోని పశువులు మాయం అవుతు న్నాయి. సిర్పూర్ టి మండల కేంద్రం లోని షేక్ హమ్మద్ గూడ ప్రాంతంలోని బోర్కెడే మోహన్ అనే రైతుకు చెందిన ఐదు ఎడ్లు దొంగ లించబడ్డాయి. రైతు బోర్కెడే మోహన్ తెలిపిన వివరాలు ప్రకారం గత నెల రోజుల క్రితం ఉదయం తనకు చెందిన ఐదు ఎడ్లు దగ్గర్లో ఉన్న పొలాల్లో మేత కోసం వదిలిపెట్టడం జరిగిందని, సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో రెండు రోజులు చుట్టూ ప్రక్కల గల పొల్లలో వెతికిన జాడ కనపడలేదని తెలిపాడు. దీంతో రైతు పోలీస్ స్టేషన్ లో కూడా పిర్యాదు చేయడం జరిగిందని, పోలీస్ స్టేషన్‌లో పశువుల జాడ కనిపించడం లేదని ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు ఎడ్ల జాడ తెలియరాలేదని రోధించాడు. వ్యవసాయం కుటుంబమైన మోహన్ పూర్తిగా పశువు లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాడని, వర్షాకాలం దగ్గరపడు తున్న సమయంలో పంటలకు దుక్కిని సిద్ధం చేసేందుకు ఎడ్లు లేక పోవడంతో వ్యవసాయ పనులు అన్ని నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైన పోలీసులు తన ఫిర్యాదుపై స్పందించి విచారణ జరపాలని, దొంగలించబడిన పశువుల జాడను తెలుసు కొని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఎడ్ల విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని తెలిపాడు.

## చెస్ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** ఉచిత చెస్ క్యాంపును సద్విని యోగం చేసుకోవాలని జడ్‌పిటిసి వేముల సంతోష్, చెస్ జిల్లా అధ్య క్షుడు ఎస్ సంపత్ కుమార్ అన్నారు. టిబిజికెఎస్ కార్యాలయంలో చెస్ కోచింగ్ క్యాంపును బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సంతోష్ మాట్లాడుతూ కోచింగ్ క్యాంపు నెల రోజులపాటు జరుగుతుందని, పిల్లలు ఉచిత కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చెస్ మెదడుకు మేత అని, పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చద రంగం ప్రపంచ ఆటలలో ప్రఖ్యాతి గాంచిందని. ప్రపంచ వ్యాపి తంగా కోట్ల మంది చెస్ ఆడుతున్నారని, చెస్ ఆటతో మేధా శక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళానైపుణ్యం కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మలరాజ్ శ్రీనివాస రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కల్పన, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి శ్రీనివాస్ తోపాటు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జక్కె బాలరాజు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** ఇల్లందకుంట మండల టియుడ బ్ల్యూజె (ఐజెయు ) ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జక్కె బాలరాజు ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా కన్వీనర్ నగునూరి శేఖర్ ఆదేశాల మేరకు బుధవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిధులుగా జమ్మి కుంట అధ్యక్షుడు నర్సిని శ్రీనివాస్, జమ్మికుంట ప్రధాన కార్యదర్శి దూలం అంజిగౌడ్, ఈసి మెంబర్ నసీరొద్దీన్, రావుల రాజేశం పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇల్లందకుంట ఐజెయు ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడిగా జక్కె బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా ఇంగిలె ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా మడిపల్లి రమేష్, సంయుక్త కార్యదర్శిగా లకిడె అనిల్, కోశాధికారిగా వడ్లూరి భాస్కర్, ముఖ్య సలహాదారుడిగా పైడిపల్లి భీమన్న, కార్యవర్గ సభ్యులుగా రావుల రాజేశం, మూడెత్తుల శివకుమార్‌లను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా జక్కె బాలరాజు మాట్లా డుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డిఆర్‌డిఒ



ప్రజాపక్షం/సోన్ : సోన్ మండలంలోని పాక్ పట్ల లో బుధవారం మధ్యాహ్నం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి ఆకస్మికంగా పరిశీలించారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలె త్తకుండా గన్ని సంచులు,తార్పాలీన్ లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదే శించారు.వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్య పరిరక్షణ కోసం సంబంధిత కేంద్ర నిర్వాహకులతో పాటు రైతులు కూడా అను క్షణం ఉండాలని పేర్కొన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ధాన్యం పరిర క్షణ కోసం అనుక్షణం అప్రమత్తంగా ఉండా ల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వహకు లతో పాటు సంబధిత రైతులపై కూడా ఉందని చెప్పారు.ఆమె వెంట కొనుగోలు కేంద్రాల నిర్వ హకులతో పాలు స్థానికులు ఉన్నారు.

## కలెక్టర్‌కు వెదురు బుట్టను అందజేసిన ఆదివాసి



ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ : పెంబి మండలం లోని కొలంగూడ,పసుపుల గ్రామ పంచాయతీ లకు చెందిన అదివాసి గిరిజనులు చేతితో అల్లిన వెదురు బుట్టను నీతి ఆయోగ్ అస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్, అదనపు కలె క్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పెంబి మండ లంలో నీతి ఆయోగ్ ఎంపిక చేసిన బ్లాక్‌లో చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి పురోగ తిపై కలెక్టర్‌కు వివరించారు.

## ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

ప్రజాపక్షం/హాజీపూర్/మంచిర్యాల క్రైం : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన హత్య జిల్లాలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా హాజీ పూర్ మండలానికి చెందిన మల్యాల నరేశ్ ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకు న్నాడు. దీనిపై పలు సందర్భాల్లో గ్రామ పెద్దల సమక్షంలో ఇరుకుటుంబాలకు పంచాయతీలు కూడా అయ్యాయి. అయినా మళ్లీ అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తుండటంతో యువతి సోదరుడు మంగళవారం రాత్రి నరేష్ అనే యుకున్ని ఆటోతో గుద్ది, బండతో బాది చంపే శాడు. నరేష్ కుటుంబ సభ్యులు తెలిపిన వివ రాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

## హరితహారం మొక్కలు నేలమట్టం

### చెట్లను నరికి ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తున్న విద్యుత్ అధికారులు



ప్రజాపక్షం/ముత్తారం : ప్రకృతిని పచ్చగా ఉండాలను కోవడం ప్రభుత్వ లక్ష్యం అయితే వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అనడం ప్రజల లక్ష్యం, మొక్కలు నాటి పెంచి పర్యావరణాన్ని సంరక్షించండి అంటున్న ప్రభుత్వ లక్ష్యం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన బుగ్గి పాలవుతోంది. విద్యుత్,ఆర్ అండ్ బీ అధికా రుల సమన్వయ లోపం కారణంగా వందలాది చెట్లు మధ్యలోనే మోడుగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని ప్రధాన రోడ్ల వెంట పచ్చని చెట్లను పెంచి పర్యావరణాన్ని రక్షించాలని హరితహా రంలో భాగంగా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే, దీనికి భిన్నంగా విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతోం దని నాటిన చెట్లను విద్యుత్ శాఖ అధికారులు ఎవరి అనుమతి లేకుండా నరికివేస్తున్నారు. ఎన్ని చెట్లు నరికిన కూడా విద్యుత్తు అంతరాయం సమస్య మాత్రం తప్పడం లేదు. విద్యుత్ సమస్యల పేరు మీద వృక్షాలను నరుకుతు న్నారే తప్ప విద్యుత్ సమస్య మాత్రం తీరడం లేదు.ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో జరిగింది. ముత్తారం, మైదాంబండ తోపాటు తదితర గ్రామాల్లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పచ్చని చెట్లు నేలకొరిగాయి. చెట్లను నరకడమే కాకుండా నరి కిన చెట్లను రహదారులకు అడ్డదిడ్డంగా పడేస్తున్నారు. నరికిన చెట్లు ఎవరు తీస్తారు అని అడగగా విద్యుత్ అధి కారులు మాత్రం సమాధానం చెప్పటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటండి, పర్యావరణాన్ని సంరక్షిం చండి అంటుంటే విద్యుత్ అధికారులు మాత్రం పెంచిన చెట్లను ఎవరి అనుమతి లేకుండా కరెంటు వైర్లకు అడ్డుగా వస్తున్నాయి అని చెట్ల కొమ్మలు కాకుండా చెట్లను పూర్తిగా నరికి వేస్తున్నారు. చెట్లను నరికివేయడం చట్ట వ్యతిరేకమైన చర్యగా భావించాలి. విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు ఎదిగిన కొన్ని సంవత్సరాల చెట్లను విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నరికివేతకు గురవుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యసాధనలో విద్యుత్ తీగల కింద మొక్కలు ప్రతి ఏటా హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన భాధ్యతను అధి కారులకు, ప్రజాప్రతినిధులకు అప్పగించారు. దీంతో ఎలాగైనా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలనే తాపత్ర యంలో ఏమాత్రం ముందు చూపు లేకుండానే ఏకంగా విద్యుత్ వైర్లకిందే మొక్కలు నాటేస్తున్నారు. నాటిన మొక్కలు రెండు ఏళ్ల లోపు విద్యుత్ వైర్లను తాకుతు న్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడు తుందని విద్యుత్ అధికారులు అంటున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవా ల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

## నాణ్యత, ప్రమాణాలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను చేపట్టాలి



జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : నాణ్యతా ప్రమాణాలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను చేపట్టాలని జిల్లా కలె క్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.బుధ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.జూన్ 5లోగా పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠ శాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో త్రాగునీరు, మరుగుదొడ్లకు, నీటి సదు పాయం, కాంపౌండ్‌వాల్ రిపేర్లు, విద్యుత్ పనులు, స్లాబ్ ల మరమ్మత్తులు, గ్రిల్స్ ఏర్పాటు, పెయింటింగ్స్ వంటి పనులు, మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. పనుల ప్రారంభం ముందు, తర్వాత ఫోటోలతో కూడిన నివేదిక లను సమర్పించాలని సూచించారు. అధికారులు సమ న్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాలల వారీగా చేపట్టిన పనులు,మరమ్మత్తులకు సంబంధించిన వివరాలను మండలాల వారీగా సమీక్షిం చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డీఈవో రవీందర్ రెడ్డి,డిఆర్డిఓ విజయ లక్ష్మి ,డిపిఓ శ్రీనివాస్,ఇతర జిల్లా అధికారులు,ఇంజనీ రింగ్,మున్సిపల్ శాఖల అధికారులు,మండల విద్యా శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పెద్దల సమక్షంలో ప్రేమ పెళ్ళి



ప్రజాపక్షం/బెజ్జూర్ : కుల మతాలకు అతీతంగా ఉండి ఆదర్శంగా నిలువాలనే మాటలను నిజం చేశారు. ముత్త నపల్లి గ్రామ పెద్దలు. కంప్యూటర్ కాలంలో కాలం చెల్లిన కులం ముచ్చట్లు చెల్లవని, మనుషులు కలిసి ఉండటా నికి కులాలు అడ్డు కాదని అందరు ఒక్కటై ప్రేమ వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళితే కౌటాల మండలం ముత్తనపేట్ గ్రామానికి చెందిన యువతి, ముంజంపల్లి గ్రామానికి చెందిన చిలుకయ్యలు కొంతకా లంగా ప్రేమించుకుంటున్నారు. వారి ప్రేమ వ్యవహారం యువతి తల్లిదండ్రులకి ఇష్టం లేకపోవడంతో ఈ విషయం గ్రామ పెద్దల ముందుకు వచ్చింది. దీంతో గ్రామ పెద్దలు ఇరుకుటుంబ సభ్యులతో మాట్లాడి వివాహం జరిపించేందుకు ప్రయత్నించగా అమ్మాయి తరపు కుటుంబ సభ్యులు వివాహానికి నిరాకరించారు. పెద్దలు ఒప్పుకోకున్న తాము ఇద్దరం కలిసే జీవిస్తామని, ఒకర్ని లేకుండా ఒకర్రం ఉండలేమని ప్రేమికులు తెలు పడంతో గ్రామస్తులు పెద్ద మనసు చేసుకొని వారే పెళ్లి పెద్దలై స్థానిక హనుమాన్ మందిరంలో ప్రేమ జంటకు వివాహం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గణపతి, సంతోష్, అశోక్, కిష్టయ్య పాల్గొన్నారు.

## నమూనా పరీక్షల కోసం అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : ఎస్‌పిఎస్‌సి గ్రూప్ 1 ప్రిలిమ్స్, యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షల కొరకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకో వాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాలోని అర్హత గల అభ్యర్థులకు నమూనా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, టిఎస్‌పిఎ స్‌సి గ్రూప్ 1 నమూనా పరీక్షలను బిసి స్టడీ సర్కిల్ ఆది లాబాద్‌లో ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీలలో, యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ నమూనా పరీక్షలను హైదరాబాద్‌లో ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీలలో నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్ లైన్‌లో https://tsbcstudycircle.cgg.gov.in/firstpage.do, వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఇతర వివరా లకు 08732221280 55 సంప్రదించవచ్చని, ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : జైనూర్ మండల కేంద్రం లో చిన్న చిన్న కారణాలతో హిందువుల కుటుంబాలపై ముకుమ్మడిగా దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షులు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ చిన్న చిన్న కారణాలతో దాదాపుగా 500 మందితో జైనూర్ మండలంలోని ఒడ్డేర్ గూడాలో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి మూకుమ్మడి దాడులు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు దుండగులని కఠినంగా శిక్షించా లని అన్నారు. అసలు ఈ గొడవలకి కావడానికి కారణాల పై పూర్తి స్థాయిలో పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ దాడిలో గాయపడిన వారి కుటుంబాలని పరామర్శించడం కోసం గురువారం హిందూ వాహిని ఆధ్వర్యంలో జైనూర్‌కు వెళ్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో హిందూ వాహిని జిల్లా ఉపా ధ్యక్షులు గడ్డల ప్రణయ్, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, తదితరులు ఉన్నారు.

## గాలివాన బీభత్సం : ఆస్తి నష్టం



ప్రజాపక్షం/దిలావర్పూర్ : మంగళవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సంతో తీవ్ర ఆస్తుల నష్టం సంభవించింది.మండలంలోని సమందర్ పల్లి గ్రామంలో పలువురి ఇంటి పైకప్పులు,పశువుల పాకలు నేల మట్టమయ్యాయి.తాజా మాజీ సర్పంచ్ బాయా రావు,బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అరుణ్ గౌడ్ ఇంటి పైకప్పు కూలిపోగా,సుమారు రెండు లక్షల ఆస్తినష్టం సంభవించిం దని,అదేవిధంగా ఏనుగు గంగాధర్,జావిద్ భాషల పశువుల కొట్టాలు గాలివానకు నేలమట్టం కాగా సుమారు 50 వేల వరకు నష్టం సంభవించిందని,కోమటి జై బ్రాత్రూం పూర్తిగా కూలిపోగా 50వేల వరకు నష్టం సంభవించిందని ఎటువంటి ప్రాణనష్టం సంభ వించలేదని తెలిపారు.ప్రభుత్వం స్పందించి వెంటనే బాధితులను ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ కోరారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనారు ఆదే శాలమేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా జరుపు తున్న గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ లో భాగంగా బుధవారం రోజు నిర్మల్ డిపోలో మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటుచేసారు.డిపోలో పనిచే స్తున్న ఉద్యోగులందరికి వైద్య పరీక్షలు నిర్వహించారు.ప్రతి ఉద్యో గికి ఈ.సి.జి,బి.పి,షుగర్,కొలస్ట్రాల్,కిడ్ని మొదలగు అన్ని టెస్టులు నిర్వహిస్తున్నారు.సూమారు 60 మంది ఉద్యోగులకు వైద్య పరీ క్షలు నిర్వహించారు.ఈ హెల్త్ చెకప్ శిబిరం డిపో లోని ఉద్యో గులు అందరు అయిపోయే వరకు ఉంటుంది.ముఖ్యఅతిధిగా ప్రముఖ దేవిబాయి క్రిటికల్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గైన కాలిస్ట్ డాక్టర్.చంద్రిక,డాక్టర్.విద్యాసాగర్ రావు హాజరయ్యారు. హెల్త్ చెకప్ చేయించు కుంటున్న ఉద్యోగులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, నవీన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థిపై మైనార్టీ పాఠశాల ఉపాధ్యాయుల పైశాచికత్వం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తమ కుమారునిపై మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు వేధింపులకు గురిచేస్తూ తమ కుమారునిపై పైశాచికత్వం చేస్తున్నారని పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎండి సలీం అతని భార్య సమీనా దంపతులు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారికి ఫిర్యాదు చేశారు. వివరాలకు వెళితే రామగుండం మైనార్టీ పాఠశాలలో తమ బాబు మహమ్మద్ వసీం ఐదవ తరగతి నుండి చదువుతున్నాడని, రెండు నెలల క్రితం బాబు స్కూల్లో వాలీబాల్ ఆడుకునేటప్పుడు దెబ్బ తగిలిందని, అప్పుడు ఏఎన్ఎం దగ్గరికి వెళ్ళగా మందులు ఇవ్వకుండా క్లాస్ టీచర్కు చెప్పమని చెప్పిందని, నా కుమారుడు ఆ విషయం క్లాస్ టీచర్కు చెప్పగా అది అన్యాదాగా భావించిన క్లాస్ టీచర్ అందులో పని చేసే బరిగేలా గోపిస్కూల్ కో ఆర్డనేటర్ కు మరియు రాజ్ నారాయణ, రమేష్ లకు చెప్పి, నా కుమారుడిని ఇష్టానుసారంగా కొట్టడం జరిగిందని, రాయడానికి వీలు లేని భాషలో తిట్టారని, రంజాన్ ఒక్కపొద్దు మాసంలో అనేక వేధింపులకు గురిచేసి, నా బాబు నమాజ్ కూడా చదవకుండా చేశారని, ప్రోగ్రెస్ కార్డు ఇచ్చేటప్పుడు నాతో బలవంతంగా పేపర్ రాయించుకున్నారని, ఎదురుగా మాట్లాడితే టీసీ ఇచ్చి పంపిస్తామని, బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తను ఆటో డ్రైవర్నని బాబును చదివించుకునే స్తోమత లేక మైనార్టీ పాఠశాలలో వేశానని, చేయని తప్పులకు నా బాబుకు టీసీ ఇచ్చి పంపించి వేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు.

## మల్యాల గ్రామంలో ఘోర రోడ్డు ప్రమాదం



**ప్రజాపక్షం/చందుర్తి :** చందర్తి మండలం మల్యాల గ్రామంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మల్యాల గ్రామానికి చెందిన ఎల్లా రమేష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై చందుర్తి వైపు వెళుతూ ఉండగా, కరీంనగర్ నుండి మానాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రమేష్ కు తీవ్ర గాయాలు అవ్వగా, గ్రామ యువకులు అంబులెన్స్లో వేములవాడ ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు.

## పెళ్లిరోజు... దివ్యాంగులకు అన్నదానం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ వర్కింగ్ ప్రెసిడెంట్ చీలు మోజు వీరాచారి రత్నమాల పెళ్లి రోజు సందర్భంగా బుధవారం సుల్తానాబాద్ పట్టణంలోని వికాసం దివ్యాంగుల పునరావాస కేంద్రం లో అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెద్దపల్లి నియోజకవర్గం బి.ఆర్.ఎస్ నాయకురాలు దాసరి ఉష పాల్గొని వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేసి, దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుమల బాపురావు, శ్రీనివాస్ , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి దందాను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తుంది




**ప్రజాపక్షం /రామగిరి :** మట్టి దందాను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తుందని బీ. ఆర్. ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్ ఆరోపించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీ. ఆర్. ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇసుక, మట్టి దందాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేస్తున్న పని ఏమిటి అని ప్రశ్నించారు. దొంగే దొంగ అని అన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వైనాల రాజు ఇప్పుడు తాను చేస్తున్న మట్టి మాఫియా పై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించకుండా ఎన్నికల సమయంలో తీర్మానం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జూలపల్లి పెద్ద చెరువులో నుండి ఇటుక బట్టీలకు మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ మట్టి మాఫియా వ్యవహారంలో ఎవరికైంత వాటా ఉందో.. ఎవరికీ ఎంత ముత్తా చెబుతున్నారో బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే ప్రోత్సాహం, అండదండలతోనే నిబంధనలకు విరుద్ధంగా పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు.సంబంధిత శాఖ అధికారులు మట్టి తరలింపు జరుగుతున్న కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి చెరువును పరిశీలించి వాస్తవిక పరిస్థితి ఏమిటో తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలల కాలం కూడ గడవక ముందే దోపిడీ రాజ్యాన్ని. మాఫియా రాజ్యాన్ని, నియంత్రత్వ, నియంత పాలనకు మంథని నియోజకవర్గంలో శ్రీకారం చుట్టారని ఇక కాంగ్రెస్ పాలనలో నిరాటాంకంగా అక్రమాల పాలన కొనసాగుతూనే ఉంటుందని, ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పి చైర్మన్ మేకల సంపత్ యాదవ్, మాజీ ఏ. ఎం. సి వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మి మల్లు, బీ. ఆర్. ఎస్ మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, బీ. ఆర్. ఎస్ నాయకులు నీలం శ్రీనివాస్, తోట వీరయ్య, సుధాకర్, రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

## అనుమతులతోనే.. జూలపల్లి పెద్ద చెరువులోమట్టి తవ్వకాలు



**ప్రజాపక్షం/రామగిరి :** కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో అనుమతుల మేరకే మట్టి పూడిక తీత పనులు నిర్వహించడం జరుగుతుందని పెద్దపల్లి జిల్లా మైనింగ్ ఏ. డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు.కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి పెద్ద చెరువులో నిబంధనలు అతిక్రమించి మట్టి తవ్వకాలు చేస్తున్నారని వచ్చిన పిర్యాదుల మేరకు ఇక్కడకు రావడం జరిగిందని చెప్పారు. జూలపల్లి పెద్ద చెరువులో పూడిక మట్టి తరలింపు కోసం ఓ బ్రిక్స్ సంస్థ నిర్వాహకులు నిబంధనల మేరకు అనుమతి కోసం దరఖాస్తూ చేసుకుని అనుమతులు పొందారని వెల్లడించారు. ఒక ఇటుక బట్టి వ్యాపారి జూలపల్లి పెద్ద చెరువు నుండి మొదటి విడతగా 4 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపు కోసం అనుమతి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ బ్రిక్స్ సంస్థ తరుపున మొత్తం 60 వేల క్యూబిక్ మీటర్లకు సంబంధించిన మట్టి తరలింపుకు అనుమతులు పొందారన్నారు. వీరికి జూలపల్లి పెద్ద చెరువులో మట్టి తరలింపుకు ఈ నెల 21 వరకు గడువు ఉందని వెల్లడించారు. ఈ చెరువులో నుండి మట్టి తరలింపు ప్రక్రియ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే నిర్వహించాలిసి ఉంటుందని వెల్లడించారు. రాత్రి వేళల్లో మట్టి తరలింపు చర్యలు చేపట్టారాదనీ హెచ్చరించారు నియమ నిబంధనలు పాటించకుంటే చట్ట రీత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టంగా వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇలా అనుమతులు ఇచ్చే అధికారం ఉంటుందా అని ప్రశ్నిస్తే ఎన్నికల కోడ్ కు దీనికి ఎంసంబంధం లేదన్నారు. నిబంధనలు అతిక్రమిచకుండా పర్యవేక్షిస్థామని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని వెళ్ళడించారు. ఆయన వెంట నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

### అంగన్వాడీ టీచర్ హత్య దారుణం



**ప్రజాపక్షం/ ముత్తారం :** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం చిన్న బోయినపల్లి గ్రామానికి చెందిన సుజాత అనే అంగన్వాడీ టీచర్ హత్య దారుణమని హత్య చేసిన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల అంగన్వాడీ టీచర్ల మండల అధ్యక్షురాలు మల్యాల శోభ డిమాండ్ చేశారు. ముత్తారం మండల కేంద్రంలో శోభ విలేకరులతో మాట్లాడుతూ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామంలో అంగన్వాడి టీచర్ సుజాత మంగళవారం మధ్యాహ్నం విధులు ముగించుకొని తన స్వగ్రామం చిన్న బోయినపల్లి పయనమైన అంగన్వాడీ టీచర్ సుజాత బుధవారం ఉదయం తాడ్వాయి సమీపంలోఅటవీ ప్రాంతంలో కొందరు కూలీ పనుల కోసం వెళ్లగా, అక్కడ సుజాత మృతదేహం కనిపించగా, వెంటనే కూలీలు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి సుజాత మెడకు గట్టిగా స్కార్ఫ్ తో చుట్టి ఉరేసి హతమార్చినట్లుగా గుర్తించారని, అదేవిధంగా సుజాత ఒంటిపై ఉన్న 4 తులాల బంగారం, సెల్ ఫోన్ కూడా దుండగులు ఎత్తుకెళ్లారని, ఈ కేసులో నిందితులను వెంటనే గుర్తించి పట్టుకొని, కఠినంగా శిక్షించాలని అధ్యక్షురాలు మల్యాల శోభ డిమాండ్ చేశారు.

## పోలీసుల సమయస్ఫూర్తితో తప్పిన అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పోలీసుల సమాస్ఫూర్తితో భారీ అగ్రి ప్రమాదం తప్పింది. వివరాలకు వెళితే పెద్దపల్లి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బంధం పల్లి గ్రామ సమీపంలో రాజీవ్ రహదారిపై బంధంపల్లికి చెందిన రైతు తన పొలంలో వరిగడ్డలకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు క్రమీపిన పెరిగి బంధం పల్లి పెట్రోలు బంకు వరకు వ్యాపించాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎఎస్ఐ రామస్వామి గమనించి పెట్రోల్ బంకు వద్ద వ్యాపించిన మంటలను పోలీస్ సిబ్బంది శరత్, శ్రీకాంత్, డ్రైవర్ శ్రీనివాస్ల సహకారంతో ఆర్పి వేసి అనంతరం ఫైర్ ఇంజన్ కు సమాచారం అందించారు. ఎంతో సమయ స్ఫూర్తితో మంటలను ఆర్పిన పోలీస్ సిబ్బందిని అక్కడున్న వారు అభినందించారు. అనంతరం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు.

అనంతరం అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు తమ పొలంలోని వరికర్లను తలగబెట్టకూడదని ఇలా చేస్తే అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఇకపై ఇలా చేస్తే రైతులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్లోని 16 సర్కిల్లలో పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది

### పెద్దపల్లి సూపరింటెండెంట్ సుదర్శనం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఏప్రిల్ 2024 సంబంధించి అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ (సబ్ డివిజన్, డివిజన్, సర్కిల్) పని పూర్తి చేసిన, అన్ని రకాల పనులపై సాధించిన ప్రగతిని దృష్టిలో ఉంచుకొని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ర్యాంకులను ప్రకటించడం జరిగిందని, 16 సర్కిల్ లలో పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రతి ఒక్క సిబ్బంది చిత్తశుద్ధితో కష్టపడి పని చేయడం వల్లనే ఇది సాధ్యమైందని పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం పాల్గొన్నారు. కంపెనీలో ఉన్న 16 సర్కిలలో పెద్దపెల్లి జిల్లాకు ప్రథమ ర్యాంకు వచ్చినట్లు, అదే విధంగా అసిస్టెంట్ ఇంజనీర్లలో సైఫుద్దీన్ కాట్నపల్లి ప్రథమ ర్యాంకు, సబ్ డివిజన్ విభాగంలో సుల్తానాబాద్ కు రెండవ ర్యాంకు, గోదావరిఖని సబ్ డివిజన్ కు మూడవ ర్యాంకు, డివిజన్లో పెద్దపల్లి డివిజన్ కు రెండవ ర్యాంకు, మంథని డివిజన్ కు మూడవ ర్యాంకు వచ్చినట్లు తెలిపారు.పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం. మాట్లాడుతూ, ఆపరేషన్ మెయింటెనెన్స్ స్టాఫ్ నుంచి ఫోర్ మెన్ వరకు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్ నుండి డివిజన్ ఇంజనీర్ వరకు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్లు, అకౌంట్ ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్ నుంచి అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ వరకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయడం వల్ల పెద్దపల్లి జిల్లా కంపెనీలో ప్రథమ స్థానం సాధించిందని అన్నారు.మే నెలలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు ఉండటం వలన విద్యుత్ వినియోగం పోయిన సంవత్సరం కంటే అదనంగా డిమాండ్ ఉన్నప్పటికీ అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా వినియోగదారులకు అందజేస్తున్నామని, దానికోసం అందరూ కష్టపడి పని చేసి అదనపు ట్రాన్స్ఫార్మర్లు కావలసిన చోట పెట్టి లో వోల్టేజ్ ఎక్కడా లేకుండా చూస్తున్నామని అన్నారు. గృహ అవసరాలకు, వాణిజ్యపరంగా కొత్త కనెక్షన్ కావలసినవారు దగ్గర్లో ఉన్న మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, వారికి వెంటనే కరెంట్ కనెక్షన్ ఇస్తామని, వ్యవసాయ బావులకు కూడా కావాల్సిన వారికి యుద్ధ ప్రాతిపదికన కనెక్షన్ అందజేయడం జరుగుతుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కార్మిక శాఖకు మంత్రిని వెల్ఫేర్ బోర్డుకు చైర్మన్ను నియమించాలి



**ప్రజాపక్షం/రామగిరి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిన కూడా ఇప్పటివరకు కార్మిక శాఖ మంత్రి ని కేటాయించలేదని వెంటనే ఆ శాఖకు మంత్రిని నియమించాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. రామగిరి మండలం భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో బుధవారం స్వామి మాట్లాడుతూ కార్మిక శాఖకు మంత్రి నీ వెల్ఫేబోడుకు చైర్మన్ ను నియమించి గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను, కార్మికులకు అందవలసిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. లేబర్ ఇన్సూరెన్స్ కార్డుకు ఆధార్ తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడంతో పాత కార్డు లో పేర్లలో తప్పుడు దొర్లకంతో కార్మికులు కార్డు రెన్యువల్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ , సురేష్, ఎస్ కే షరీఫ్, సంపత్ , సంతోష్, రాయమల్లు సంతోష్ రాములు పాల్గొన్నారు.

## రత్నపూలో ఎల్లమ్మ ఉత్సవాలకు ముస్తాబు

### నేటి నుంచి 22 వ తేదీ వరకు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు దేవాలయం ముస్తాబయింది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని గౌడ సంఘం అధ్యక్షులు ముక్కెర ఓదెలు, దేవాలయం చైర్మన్ ముక్కెర జంగేటి కుమార్, కెక్కర్ల శ్రీనివాస్, దాసరి రామన్న, మోత్కూరి శ్రీనివాస్, ముక్కెర సతీష్, కెక్కర్ల సమ్మయ్య, కెక్కర్ల రమేష్, ముక్కెర సత్తయ్య, ముక్కెర చిన్నా, కెక్కర్ల రాకేష్, పబ్బ మొగిలి, నగునూరి సతీష్ తెలిపారు.గురువారం పోచమ్మ ఉత్సవాలు, 17, 18 న జోగు కార్యక్రమం 1922 వ తేదీ వరకు రేణుక ఎల్లమ్మ కొలువు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణీ



ప్రజాపక్షం/చందుర్తి : నిండు గర్భిణీ అంబులెన్స్ లోనే ప్రసవించిన ఘటన చందుర్తి మండలంలో బుధవారం వేకువ జామున చోటుచేసుకుంది. మండలంలోని జోగాపూర్ గ్రామం గంగిరెద్దుల కాలనీకి చెందిన గంట స్వప్న బుధవారం వేకువ పురిటినొప్పులతో బాధపడుతూ ఉండగా 108 కి సమాచారం అందించారు. అంబులెన్స్‌లో గర్భిణీని ఆసుపత్రికి తీసుకెళ్తూ ఉండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆవిడను చందుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. సకాలంలో అంబులెన్స్ సేవలు అందించిన పైలెట్ బాబు, ఈఎంటి విక్రమ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ



ప్రజాపక్షం /సుల్తానాబాద్ : మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గిట్ల ముకుంద రెడ్డి జయంతి సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రంలోని ఎలిగేడు, నారాయణ పల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు బుధవారం ఎలిగేడు బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు, గిట్ల అభిమానులు దుస్తుల పంపిణీ చేశారు. అనంతరం సీట్ల పంపిణీ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందంటే అది ముకుంద రెడ్డి హాయంలోనే జరిగిందని ఆయన లేని లోటు స్పష్టంగా కనబడుతుందని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మడ్డపల్లి భారతి, అంజయ్య, బూసంపల్లి కొండయ్య , ఎలిగేడు సింగిల్ విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గుడుగుల మహేందర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రంగు శ్రీనివాస్ గౌడ్ , మాజీ వార్డ్ సభ్యులు మామిడాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచు గాజులసందడి..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : వైశాఖమాస శుక్ల పక్షంలో ఆడపడుచులు గాజులు కొనడంతో లేడిస్ ఎంపోరియంలు కిటకిటలాడుతున్నాయి.మహారాష్ట్రలో ప్రారంభైన అనవాయితీ తెలంగాణకు ప్రాకింది.పుకార్లు స్టార్ట్ అయ్యింది.లేదంటే అరిష్టం అని అనుకుంటున్నారు.గాజులు వదిన మరదళ్ళు గాజులు తొడగడటం సాంప్రదాయం నెలరోజుల వరకు ఉంటుందని ఇప్పటికే పదిరోజులు దాటిందని మహిళామణులు అనుకుంటున్నారు.గాజుల పండుగకు సుమారుగా వేయి రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. మహిళలకు వదిన మరదళ్ళ పండుగ మాత్రం మండలంలో గాజుల దుకాణాలు పూర్తిగా మహిళలతో నిండిపోతున్నాయి.ఇలాంటి సెంటిమెంటు కొంత మంది మహిళలు మా భాంధవ్యాలు దృఢంగా ఉంటాయని ఎవరేమనుకుంటే మాకేంటి అని కొట్టిపడేస్తుండటం విశేషంమరి..

# చెరువులను ఆదాయ వనరుగా మార్చుకున్న అక్రమార్కులు

**భారీగా మైనింగ్ అధికారుల ముడుపులు...?**

**వార్తలు రాస్తే బెదిరింపులు**



ప్రజాపక్షం/సారంగాపూర్ : మూడు పువ్వులు ఆరు కాయలుగా అందిన కాడికి దండుకుంటూ అధికారులు మౌనం పాటిస్తూ వార్తలు రాస్తున్న ప్రతికల రిపోర్టర్స్ పై దాడులకు దిగుతున్న సందర్భాలు..ఇంత జరుగుతున్న మైనింగ్ అధికారులు అటువైపు చూడడం లేదంటే..ముడుపులు అందినట్లేనా...? రాజకీయ పార్టీ నాయకుల ఒత్తిడి ఏమైనా ఉందా అధికార,ప్రతిపక్ష పార్టీల నాయకుల వాహనాలు కావడం అటువైపు కన్నెత్తి చూడడం లేదనేది విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.అక్రమ మొరం దందా యధేచ్ఛగా కొనసాగుతుంది.కొందరు అక్రమార్కులు చెరువులోని సహజ సంపదను కొల్లగొట్టి ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు.అనుమతులు లేకుండా.తవ్వకాలు సాగిస్తుండడంతో లక్షల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలోని నాగమ్మ చెరువు,కోమటోడి చెరువు,అడెల్లి గ్రామ సమీపంలోని జనగల కుంటా చెరువు నుండి పగలంతా నల్ల మట్టి,రాత్రి పూట మొరన్ని అక్రమంగా పందికొక్కుల తోడేస్తున్నారు.పట్టుకున్న ట్రాక్టర్లను నామమాత్రం జరిమానా విధించి వదిలేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. నిఘా బెట్టి చర్యలు చేపట్టాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో పడి అక్రమార్కులకు వంత పడుతూ..మొరం ట్రాక్టర్లను పట్టుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకోగా,ఎక్కడపడితే అక్కడ వెంచర్లు వెలిశాయి. జామ్, సారంగాపూర్, అడెల్లి పరిసర గ్రామాల్లో వెలసిన వెంచర్లకు, గృహ నిర్మాణాలకు మొరం అవసరం కావడంతో ప్రాణహిత చేవెళ్ల వరదా కాల్వ తవ్విన ఇరువైపులా ఉన్నమొరం తో పాలు, చెరువులోని మొరం తవ్వుతూ అక్రమ వ్యాపారులు జేసీబీ యంత్రాలతో మొరం మట్టిని తోడేస్తూ ట్రాక్టర్లు,టిప్పర్ల ద్వార వెంచర్‌లకు,గృహ నిర్మాణాలకు తరలిస్తూ సోమ్ము చేసుకుంటున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ లోడ్ మొరం మట్టికి రూ.650 నుంచి రూ 700 వరకు,దూరం ఎక్కువైతే అదనంగా మరో రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసుకుంటున్నారు.అక్రమార్జన చేస్తూ మూడు పువ్వులు ఆరు కాయలు గా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

**నిబంధనలు బేఖాతరు..**

ప్రభుత్వ,ప్రైవేటు భూముల్లో మొరం,మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మండల రెవెన్యూ,భూగర్భ గనుల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.ఈ మేరకు వాల్టా చట్ట ప్రకారం ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి తవ్వకాలు చేపట్టాలి.ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.ఈ మట్టి,మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను,వాహనాలకు,మోరం తవ్వుతున్న జేసిబికి నెండర్ ప్లేట్ లను తొలగించి మట్టిని తరలిస్తున్న వ్యాపారులు. చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు.

# తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు

ప్రజాపక్షం/మంథని : ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపల్ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి తెలిపారు. మంథని మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో వాటర్ బోర్ మరమ్మత్తు, ప్రధాన రహదారిలోని డివైడర్‌లో పిచ్చి మొక్కల తొలగింపు పనులను ఆమె పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12వ వార్డు నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ బోర్ మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకు రావడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో సైతం నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. అలాగే పట్టణంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించడం జరిగిందని, వర్షాకాలం ప్రారంభం అవుతున్న క్రమంలో ఎక్కడా అపరిశుభ్రత నెలకొనకుండా పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీల్లో పూడికతీత, రహదారుల్లో పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. తమ సమస్య చెప్పిన వెంటనే స్పందించి బోర్‌కు మరమ్మత్తులు చేయించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డిని వార్డు వాసులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ వేముల లక్ష్మి సమ్మయ్యతో పాటు స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

# ఎన్నికలలో పోలీసుల కృషి అభినందనీయం



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో నిర్వహించడంలో జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగం నిర్విరామంగా కృషి చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణకు సంబంధించి, ఎన్నికల వేళ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా అన్ని రకాల ప్రణాళికలు ఏర్పాటు చేసి జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. బస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారదర్శకం నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలియజేశారు. ఎన్నికల సమయంలో జప్తు చేసిన వాటి వివరాలను వెల్లడించారు. 182 కేసు లలో రూ.2,04,72,950 నగదు. రూ. 2,40,140 విలువ చేసే 9.588 కిలోల గంజాయి, 14 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని, మద్యం 1315లీటర్లు పట్టుకోవడం జరిగిందని వాటి విలువ రూ 6,54,878లు ఉంటుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వలెన్స్ టీమ్స్, కండక్ట్ కోడ్ టీమ్స్, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న అధికారులు, సిబ్బంది, మహిళా సిబ్బంది, హోంగార్డులు, ట్రైనింగ్ కానిస్టేబుళ్లు, ట్రైనింగ్ సిబ్బంది, కేంద్ర బలగాలు సిఆర్‌పిఎఫ్ మొత్తం అధికారులు సిబ్బంది 2000 మంది అధికారులు సిబ్బందితో లోక్ సభ ఎన్నికలకు బందోబస్తు విధులు నిర్వహించారని తెలియజేశారు. ఆధునిక సాంకేతికత ను ఉపయోగించి ఎన్నికలను నిర్వహించడం జరిగిందని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కేంద్ర పారా మిలిటరీ దళాలతో పటిష్టమైన బందో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, గ్రామాల్లో ఎన్నికలపై గ్రామాల ప్రజలకు పోలీసు కళా బృందం ద్వారా జానపద కథలు, నాటకాలు, పాటల ద్వారా పౌరులకు ఓటు హక్కు గురించి వారు నిర్భయంగా ఓటు వేయదానికి శాంతియుత వాతావరణాన్ని కలిపించడం కోసం పోలీస్ వారు తీసుకుంటున్న చర్యల గురుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అడ్మిషన్ల కోసం ఆహ్వానం

ప్రజాపక్షం/ సుల్తానాబాద్ : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల భూపతిపూర్ మండలం సుల్తానాబాద్ లో ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బాలికలు అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థినిలు సంప్రదించాలని స్పెషల్ ఆఫీసర్ ఎం, స్వప్న బుధవారం తెలిపారు,2024 25 విద్యా సంవత్సరంనకు గాను హాస్టల్ వసతి తో పాటు ఆరవ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం CEC&MPHW(F) ఇంగ్లీష్ మీడియం తరగతులలో అడ్మిషన్ పొందాలని అనుకునే విద్యార్థినిలు 6వ తరగతి వారైతే ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీల తో ..,ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థినులైతే ఎస్ఎస్సి ఆన్లైన్ మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలతో పాఠశాల వద్దకు వచ్చి గాని, 9963471638 కు ఫోన్ చేసి గాని సంప్రదించగలరని స్పెషల్ ఆఫీసర్ ఎం. స్వప్న తెలిపారు.

# నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : స్వయం సంఘాల గ్రూపులకు చెందిన మహిళలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. స్వయం సంఘాల గ్రూపులకు చెందిన మహిళలు యంత్రాలపై విస్తారాకులు, పేపర్ ప్లేట్స్, చట్నీలు, వక్కపొడి, లెదర్ బ్యాగ్స్, స్వీట్స్, సమోసాలు, పిండి వంటలు, మగ్గం వర్క్స్ ఇతర సామాగ్రి తయారు చేసి, విక్రయిస్తున్నారు. వీరందరితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా వస్తువులు తయారు చేసే వారితో మాట్లాడారు. వస్తువుల తయారీ, దానికి అయ్యే ఖర్చు, ఎంత మందికి ఉపాధి అవకాశాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, మెప్మా డీఎంసీ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ జువ్వాడి చలపతిరావు మాతృవియోగం



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : కామ్రేడ్ జువ్వాడి చలపతిరావు సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వారి తల్లి జువ్వాడి సూరమ్మ ఈరోజు మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాదులోని అల్వాల్ లోని చిన్న కుమారు కుమారుడ్ని ఇంటిలో అమరత్వం పొందింది. 1974 75 ఎమర్జెన్సీ ప్రాంతంలో ప్రజల స్వేచ్ఛ హక్కుల పైన దాడి జరిగినపుడు కామ్రేడ్ జే వి చలపతి అన్న ప్రజల వైపు పోరాడుతూ నిలబడ్డారు. చంద్ర పుల్లారెడ్డి నాయకత్వం గల సిపిఎంఎల్ పార్టీ రెండుగా విడిపోయి కరీంనగర్ ప్రతిఘటన పోరాటం ప్రజల అర్పించిన త్యాగాలు దిక్కే కాబట్టి నిలబడ్డాడు అనేకమంది ఎవరు ఏమాత్రం వెనకడుగు వేయకుండా దోపిడీ లేని సమాజం కోసం పోరాటాల నిర్ణయించుకొని ఇప్పటికీ ప్రజల పక్షమే ఉన్నాడు. కామ్రేడ్ జే వి చలపతి అన్న ఐదు దశాబ్దాల ఉద్యమ చరిత్రలో అలాంటి కొడుకును కానీ దోపిడీకి ఎదురుగా నిలబడాలని స్వేచ్ఛకై పోరాడాలని, హక్కులకై పోరాడాలి సమాజ మార్పుకై నిలబడాలని కోరుకున్న తల్లులలో సూరమ్మ ఒకరు ఇలాంటి తల్లులు తెలంగాణలో వందలు వేలుగా ఉన్నారు. అలాంటి కొడుకుల మూలంగానే దేశంలో మార్పు కోసం సాగే బిడ్డలు ఎంతోమంది నిరంతరం ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నారు.